# దొంగ

-బద్దిగం పాండురంగారెడ్డి

మసక మసకగా వుంది వెన్నెల. చెట్లకింద వున్న చీకటిలోంచి నడుస్తున్నాడు గోపాలం. మోకాళ్ల పైకి ఎగకట్టిన పంచెకట్టూ, ఛాతీకి బిగుతుగా అంటుకునిపోయిన బనీనూ, మొలలో చిన్న కత్తీ... ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో ఉన్నాడు గోపాలం.

ఒకే ఒక గ్లాసుడు నాటుసారా పుచ్చుకున్నాడు బలానికీ, హుషారుకీ. చదువురానివాడైనా ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం నడవాలి గోపాలానికి. ఏ పని చేసినా ముందూ వెనుకా చూసి ఆలోచించి బేరీజు వేసే అలవాటు ఉంది అతనికి. ఒక స్వాభావికమైన వివేకం ఉంది. అందుచే రత్తయ్య, సోములు ఎంతో నమ్మకముంచి అతనిమీద ఈ బాధ్యత వేసారు. వాళ్లిద్దరూ లేకుండా ఉంటే పనులు సవ్యంగా జరుగుతాయి. వాళ్లిద్దరికీ నిదానంలేదు. ఉత్త కంగారు, ఉత్తి ఆశ తప్ప.

రాత్రి ఒంటిగంట దాటితేగానీ ఆవిడ మొగుడు ఇంటికి రాడు. రెండువారాలు పరిశీలనగా చూసి ఈ విషయం గ్రహించాడు. ఆ క్లబ్‌లో కూర్చుని ఖరీదైన మందు తాగుతూ, పేకాడుతూ డబ్బయిపోయేవరకూ అక్కడే ఉంటాడు. ఈలోగా అతని భార్య ఒంటరిగా వంట గదికి పక్కగా ఉన్న గదిలో పడుకుని నిద్రపోతుంది. వంటగదికి దొడ్లో నుంచి వెళ్లాలి. దొడ్డి చాలా పెద్దది. ఎన్నో మొక్కలు, చెట్లు ఉన్నాయి. వాటి నీడలో తాను కనిపించడు. మరీ మంచిది.

వంటగది కిటికీ వానకి తడిసి, ఎండకి ఎండి కమ్మీలు పట్టుతప్పి ఉన్నాయి. బలంగా, తెలివిగా పని చేస్తే మూడు నాలుగు ఊచల్ని తీసేయవచ్చు. ఇంక ఒకసారి వంట గదిలో ప్రవేశించాక పని చాలా సులభం. తాను అవతల గది తలుపు కొడతాడు మెల్లగా. ఆవిడ ఏ ఎలకో, పిల్లో అనుకుని తలుపు తీస్తుంది. అంతే! తాను కత్తి చూపించి భయపెడతాడు. మెళ్లో వున్న నాలుగు పేటల గొలుసు, చేతికున్న అరడజను బంగారు గాజులూ ఒడుపుగా, తాపీగా తీసుకుంటాడు. ఆమె తెప్పరిల్లేలోపల, కేకలేసేలోపల తోటలోకి, చీకట్లోకి అదృశ్యమైపోతాడు. గోపాలం ఇలాగ తన ప్లానంతా ఆలోచించుకుంటూ నిబ్బరంగా నడుస్తున్నాడు. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. అక్కడక్కడ ఒకరిద్దరు తప్పించి ఊరికి దూరంగా వున్న కొత్తపేట ఇది. ఊళ్లో ఉన్న కిళ్లీకొట్టు, చిన్న కాఫీ హోటలు మూసేస్తారు. చాలా ఇళ్లు నిద్రలో మునిగిపోయాయి. కొన్ని ఇళ్లల్లోంచి మాత్రం విద్యుద్దీప కాంతి కిటికీలోంచి వస్తోంది. మొత్తంమీద వీధులూ, ఇళ్లూ ఆ మసక వెన్నెలలో ఒంటరిగా గోపాలం కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నాయి.

గోపాలానికి తాను చేసే పనిమీద నైతిక సందేహాలు ఏమీలేవు. దొంగతనం తప్పనీ, పాపమనీ అతను అనుకోలేదు. ఎందరో తమ తమ అవసరాలకి ఎన్నో వృత్తులూ, ఉద్యోగాలు చేసినట్లుగా అతనూ ఇది చేస్తున్నాడేతప్ప మంచిచెడ్డలు సూక్ష్మ విచారణ చేసే పిరికితనంగానీ, అసలటువంటి ఆలోచనలకి అవసరంకానీ అతనికి కనిపించలేదు.

అందువలన అంతరాత్మని నొక్కివేయడమూ, ఒప్పించడమూ లాంటి బాధలు కలగలేదు. తన పనిలో దొరికిపోతే జైలుకు వెళ్లాలన్న భయమూ, జ్ఞానమూ ఉన్నాయి అతనికి. అందుకే జాగ్రత్తగా ప్లాను చేసుకుంటాడు. ఎంతో అవసరమైతే కానీ రత్తయ్యనీ, సోముల్నీ వెంట తీసుకుని వెళ్లడు. వాళ్లిప్పుడు తన కోసం ఆశగా ఎదురు చూస్తుంటారన్న ఆలోచన అతనికి మరింత ఉత్సాహం ఇచ్చింది.

ఆ ఇల్లు మసక వెన్నెలలో ముడుచుకున్న తాబేలులా ఉంది. ప్లాను ప్రకారం ఇంటి వెనక్కివెళ్లి దొడ్లోకి ప్రవేశించాడు. అరటి చెట్లు, కొబ్బరిచెట్లు, ఏవేవో మొక్కలూ, తుప్పలూ అంతా గలీజుగా, చీకటిగా ఉంది. నెమ్మదిగా నడిచి వంట గది దగ్గర కొచ్చాడు గోపాలం. కిటికీ ఊచల్ని ఒకసారి లాగి చూసాడు. ఇంతలో అతనికి లోపల్నుంచి మాటలు వినిపించాయి. అతనికి ఆశ్చర్యం కలిగింది. తన పథకం అప్పుడే దెబ్బతినట్లు అనిపించింది. ఈసారి మాటలు కొంచెం గట్టిగా, కోపంగా వినిపించాయి. గోపాలానికి కుతూహలం కలిగింది. బహుశా ఆ వచ్చిన వాళ్లెవరైనా మళ్లీ వెళ్లిపోవచ్చు. తన మార్గం నిరాటంకం అవవచ్చు అని కూడా అనిపించింది. ఒకవేళ ఎవడేనా ప్రియుడేమో? మొగుడు లేకుండా చూసి ప్రేమ కలాపం జరుపుతుందేమో అనే ఊహ తట్టింది. మాటలు తొందరగా, గట్టిగా వినబడుతున్నాయి. ఆవిడ గొంతులో ఏదో భయం, బాధా ఉన్నాయి. అతనికి కుతూహలం హెచ్చింది. బలంగా ఊచల్ని లాగి కదిపి ఊడదీసాడు.

నేర్పుగా ఏర్పడిన జాగాలో నుంచి వంటింట్లోకి ప్రవేశించాడు. పక్క గదిలోంచి మాటలు వినబడుతున్నాయి.

"వద్దండీ నా మాట వినండి" ఆవిడ గొంతు.

"ఇస్తావా? తగలనియ్యనా?" మగ గొంతు.

"ఎందుకు జూదమాడి తగలేస్తారు చెప్పండి. కాపురానికి వచ్చిన నాటి నుండి సరదాలేదు, సుఖంలేదు. ఉన్న ఆస్తంతా తగలేసారు చాలదా?"

"వెధవ లెక్చర్లు ఇవ్వక మర్యాదగా తీసి ఇలా ఇయ్యి. లేకపోతే..."

"ఉన్న ఈ ఒక్క గొలుసూ, ఈ ఆరుగాజులూ ఇస్తే నా గతేంకాను. బాబు గతేంకాను? చూడండి వాడ్ని... కన్నకొడుకుని. మీకు దయ లేదా? జాలి లేదా? ఏమండి ఇవాల్టికి ఊరుకోండి. పన్నెండు గంటలవుతోంది. ఒక్కర్తినీ బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాను. దయచేసి ఇంట్లోకి పదండి."

కర్కశంగా వినబడింది ఈసారి మగగొంతు.

"ఇస్తావా? పీక పిసికి చంపెయ్యమంటావా? వెధవ పీడా వదుల్తుంది."

"ఇవ్వను"

"ఇవ్వవా?"

"ఇవ్వనుకాక ఇవ్వను. ఇవి మా పుట్టింటి వారు పెట్టినది. ఇవి నా ఆస్తి."


వింటున్న గోపాలానికి ఆవిడ మాటలలో ఏదో న్యాయం గోచరించింది. ఆవిడ గొంతు తియ్యగా, సన్నగా, జాలిగా ఉంది. గోపాలానికి ఆవిడ మొగు

డిమీద కోపమొచ్చింది.

"నీ ఆస్తా? ఏమిటే పేలావు? ఇన్నాళ్లూ తిన్నది నా డబ్బుకాదూ? ఇయ్యి ఆ గొలుసూ, గాజులూ"

"ఏమండీ! ఇలా అన్యాయంగా మాట్లాడతారేమండీ... నేను మాత్రం మీకోసం, మీ బాగుకోసం కాదూ చెబుతున్నది. ఈ గొలుసూ, ఈ గాజులే ఇంక మనకి ఆధారం. నాకు పసుపు కుంకుమల కింద ఇచ్చిన రెండెకరాలూ మీరు అమ్మేస్తే ఏమైనా అన్నానా? మీరు తాగుతారు, జూదమాడతారు, మీకు మంచీచెడూ, భార్యా కొడుకూ అన్న విచక్షణ లేకుండాపోయింది. ఈనరకంలో నేను మగ్గిపోతూ ఉండాల్సిందేనా? మీ కాళ్లు పట్టుకుంటాను. నా మాట వినండి"

ఛెళ్లుమని చప్పుడు వినిపించింది గోపాలానికి. జాలీ, ఉద్రేకం కలిగాయి.



దీనంగా, మధురంగా ఉన్న ఆమె గొంతు అతన్ని ఆకట్టుకుంది.

"కొట్టండి, చంపండి. నా నగలు మాత్రం ఇవ్వను."

"ఇవ్వవూ... ఇవ్వవుటే" మళ్లీ గుద్దినట్లు చప్పుడు. ఆమె ఏడుస్తోంది. నిస్స హాయంగా, దీనంగా, బాధగా ఆమె ఆక్రోశించింది. ఇద్దరూ పెనుగులాడు తున్న ధ్వని వినిపించింది గోపాలానికి.

"వదలండి... నన్ను వదలండి... అమ్మో"

గోపాలం పిడికిళ్లు బిగించాడు. అతని కళ్లల్లో ఎర్రజీర కదిలింది.

"పీక పిసికి తీసుకువెళతాను. ఆ గొలుసూ, గాజులూ ఇలా పడేయ్"

"ఎందుకివ్వాలి మీకు? తగలెయ్యడానికేనా?" ఆమె వెక్కివెక్కి ఏడుస్తూనే మాట్లాడుతోంది. "పిల్లవాడికి దగ్గు మందైనా తీసుకురాలేదు. ఒక్క మంచి చీరాలేదు. కట్టుకున్న పెళ్లాం చచ్చిందో, బతికిందో చూడరు. ఇంక వీధుల వెంట ముష్టి ఎత్తుకుని బతకాలి నేను"

"ఈ వేలెడు వెధవ కోసం నాకివ్వవన్నమాట. ఆగు వీడిని చంపేస్తాను. వీడి పీక నులిపేస్తాను."

"అయ్యో...అయ్యో వాడ్ని ఏమీ చేయకండి. అయ్యో...అయ్యో..." ఆవిడ పెద్ద పెట్టున కేకలు. పిల్లవాడు కెవ్వుమని ఏడుపు.

గోపాలం ఇక ఆగలేకపోయాడు. పిల్లవాడ్ని పీక నులిమి చంపేస్తున్న దృశ్యం అతని కళ్లముందు మెదిలింది. బలమంతా ఉపయోగించి తలుపు తన్నాడు. రాలేదు. తిరిగి దడదడా తన్నాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఆమె పిల్లవాడ్ని ఎత్తుకుని గోడ మూలగా నక్కి ఉంది. వణికిపోతోంది.

"బాబునేమీ చేయకండి. వదలండి. ఇవిగో గాజులూ, గొలుసు" అంటూ మీదికి రాక్షసుడిలా వస్తున్న అతడికి గొలుసూ, గాజులు ఇస్తోంది. మొగుడు వాటిని తీసుకుని వెనక్కు తిరిగాడు. ఎదురుగా గోపాలం.

"ఎవడవురా నువ్వు?" అన్నాడు మొగుడు.

గోపాలం బలంగా అతని దవడమీద ఒక్కటి వేసాడు. అతను తూలి పడ బోయాడు.

గోపాలం ఈసారి మీదకి ఉరికి అతని తల వంచి బలంగా గుద్దాడు. అతను కిందపడ్డాడు.

"ఆడకూతుర్ని కొడతావా? ఆ గొలుసూ, గాజులు కాజెయ్యాలని చూస్తావా? దొంగ ఎదవా! సిగ్గులేదురా నీకు? ఏవి ఆ గొలుసూ, గాజులు ఇలా ఇయ్యి. లేవకు. లేచావంటే చంపేస్తాను."

గోపాలం అతనికి చేతిలోంచి గొలుసు, గాజులు లాక్కున్నాడు. అతను కిందపడి వగరుస్తున్నాడు. రొప్పుతున్నాడు. ఆమె ఈ హఠాత్పరిణామం అర్థం కాక నిశ్చేష్టురాలై గోడకి బల్లిలా అంటుకుని కళ్లప్పగించి చూస్తోంది.

"తాగుడూ, జూదమ్రా నీకు? సదువుకున్నోడివి, ఉద్యోగం చేసి పెళ్లాం పిల్లల్ని పోషించాల్సింది, పైగా పెళ్లాం నగలే ఎత్తుకుపోతావ్రా దొంగ నాయాలా!"

నేలను కరచుకున్న మొగుడు అస్పష్టంగా బూతులు తిడుతున్నారు. గోపాలం డొక్కలో ఒకటి తన్ని "నోర్ముయ్" అన్నాడు.

ఆమె "వద్దు...వద్దు...కొట్టకు" అని అరిచింది.

గోపాలం చేతిలో గొలుసు, గాజులతో ఆమెను సమీపించాడు. ఆమె సన్నగా, ఎర్రగా, నాజూకుగా ఉంది. జుట్టంతా రేగిపోయి ఉంది. చెక్కిళ్లు కన్నీళ్లతో తడిసిపోయి ఉన్నాయి. ఆమెకు పాతికేళ్లు కూడా ఉండవేమో! ఆమె కళ్లల్లో భయం, ఆశ్చర్యం పెనవేసుకున్నాయి. చంకలో పిల్లవాడు ఏడుస్తు న్నాడు.

"ఇవిగోనమ్మా నీ నగలు" అంటూ అవి ఆమె చేతికి ఇచ్చాడు. కింద పడి పోయిన మొగుడు లేవబోయాడు. గోపాలం మొలలోనుండి కత్తి తీసాడు.

"ఇదేమిటో చూసావా? లేవడానికి ప్రయత్నించావో పొడిచేస్తాను. ఖబ ర్దార్. దెబ్బకి ఎగిరిపోతావు."

మొగుడు దండం పెట్టాడు.

"నువ్వు మళ్లీ ఎప్పుడైనా నగలు తీసుకున్నట్లుగానీ, ఆవిడ వొంటిమీద దెబ్బ పడినట్లుగానీ తెలిసిందా నీ ప్రాణం తీసేస్తాను" గోపాలం కత్తిని అతని ముఖానికి దగ్గరగా పెట్టి ఝుళిపించాడు.

అతను తలూపాడు ఇంకెప్పుడూ చెయ్యనన్నట్లుగా.

గోపాలం ఆమెవైపు తిరిగాడు.


"ఏం భయంలేదు. ధైర్యంగా ఉండమ్మా" అన్నాడు.

ఆమె భయంతో, కృతజ్ఞతతో తలూపింది.

గోపాలం కత్తి లోపల పెట్టుకుని వెళ్లబోతుంటే ఆమె హీన స్వరంతో "ఎవరు బాబూ నువ్వు?" అని అడిగింది.

"నేనా...నేనా..." నన్ను గోపాలం అంటారులెండి. అంతే" అంటూ గోపాలం తలెత్తకుండా వడివడిగా పెరట్లోకి చీకట్లోకి వెళ్లిపోయాడు.

★



## తరగని అందం

ఎన్ని వసంతాలైనా తరగని అందాన్ని తనలో ఇముడ్చుకున్న అరుదైన నటి రేఖ. నేటితరం హీరోయిన్లకు స్ఫూర్తినిచ్చే నటనా సామర్థ్యంతో సమర్థ నటిగా పేరు తెచ్చుకున్న ఈ తమిళ అమ్మాయి త్వరలో తమిళంలో నటించడానికి సమాయత్తమవుతోంది. తన జన్మభూమి రుణం తీర్చుకోవడానికి మంచి సబ్జెక్ట్‌తో నిర్మితమవుతున్న ఓ చిత్రంలో ప్రతి నాయికగా నటించనుంది. తమిళ హీరోలందరూ ఈమెతో కలసి నటించడానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు.

